## క్లుప్తంగా

### విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

ఎస్ఈ విజయ్‌కుమార్



మాచర్ల: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా సూపరింటెండెంట్ పి.విజయ్‌కుమార్ కోరారు. మండలంలోని విజయపురిసౌత్‌లోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో విద్యుత్ అధికారులు, సిబ్బందితో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. రెవెన్యూ వసూలు గురించి, చేపట్టిన పనుల గురించి చర్చించారు. విజయకుమార్ మాట్లాడుతూ వినియోగదారులతో మమేకమై వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. పనులు ఎటువంటి జాప్యం లేకుండా చేయాల్సిందిగా ఆదేశించారు. ఏప్రిల్, 2025లో రెవెన్యూ కలెక్షన్ పరంగా 100 శాతం లక్ష్యం చేరుకున్న సిబ్బందికి ప్రతిభ అవార్డులు అందజేశారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బి.వెంకటేశ్వరరావు, మాచర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.సింగయ్య పాల్గొన్నారు.

### ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవం



మాచవరం: మండలంలోని కొత్తపాలెం శివారు ఆకురాజుపల్లి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవం భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండల పరిసర గ్రామాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. క్యూ లైన్లలో బారులుతీరి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. మాచవరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులకు స్వామి ప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలతో నిర్వహించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొత్తపాలెం గ్రామస్తులు ప్రభలను ఏర్పాటు చేశారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాఅన్నదానం చేశారు.

### చిన్నారులు తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాచర్ల: అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీశైలం రోడ్‌లోని స్వామి వివేకానంద సేవా శ్రమంలో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాచర్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్, సీనియర్ లాయర్స్ గంగుల శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వారు పిల్లలను ఎత్తుకొని వెళ్లటానికి వచ్చారని గుర్తించి సమీపంలోని పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం కానీ ఏదైనా గవర్నమెంట్ ఆఫీస్ దగ్గరికి వెళ్లి తెలియజేయాలని కోరారు. అంతే కాకుండా వారు పిల్లలను తీసుకెళ్లి వారి దగ్గర నుంచి అవయవయాలు తీసి వాటిని అమ్ముకునే ప్రయత్నం చేస్తారని అంతే కాకుండా పిల్లలను వేరే వారికి అమ్మి వేస్తుంటారని వివరించారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు, మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ సభ్యులు మెట్టు గోవింద రెడ్డి మాట్లాడారు.

### నేడు ఎరువుల వేలం

ఏడీఏ హనుమంతరావు

క్రోసూరు: క్రోసూరు మార్కెట్‌యార్డులోని అగ్రి ల్యాబ్‌లో పరీక్షించబడిన నాణ్యమైన ఎరువులు సోమవారం వేలం వేస్తున్నట్లు ఏడీఏ వి.హనుమంతరావు ఆదివారం తెలిపారు. 60.600 కిలోల యూరియా, కాంప్లెక్స్ ఎరువులను వేలం వేస్తున్నట్లు తెలిపారు. కావున రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఏడీఏ కోరారు.

### అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న తిరుపతమ్మ వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పల్నాడు జిల్లా అమరావతి మండలం నిడుముక్కల గ్రామానికి చెందిన గడ్డిపాటి పద్మావతి కుటుంబ సభ్యులు రూ.15 వేలను ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రైలుబండి మళ్లీ ఆగితే బాగుండు..

- హాల్ట్ కోసం ఎదురుచూపులు
- రెండు దశాబ్దాలుగా పట్టించుకోని అధికారులు
- పాలకులు మారుతున్నా.. ప్రయాణికులకు తీరని ఆశ
- పాలువాయిగేటు హాల్ట్‌తో తొమ్మిది గ్రామాలకు ప్రయోజనం
- ప్రస్తుత ఎంపీ స్పందిస్తే కల నెరవేరే అవకాశం



మాచర్ల రూట్‌లో పాలువాయిగేటు వద్ద..

రెంటచింతల: రైల్వే హాల్ట్ అదిగో ఇదిగో అంటున్నారు. రెండు దశాబ్దాలుగా ఇదే తంతు. కొత్తగా ఉన్నతాధికారులు రావడం స్థానికులు వినతిపత్రాలు ఇవ్వడం. కానీ దీనిపై నిర్దిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. రెంటచింతల, మాచర్ల మండలాలకు చెందిన తొమ్మిది గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

వివరాలు.. మండలంలోని పాలువాయిగేటు గ్రామం వద్ద రైల్వేహాల్ట్ మీటరుగేజ్‌గా ఉన్న సమయంలో ఉండేది. బ్రాడ్‌గేజ్‌గా మారిన కొంత కాలం వరకు ఉంది. 2000లో రైల్వే అధికారులు ఆదాయాన్ని అంచనా వేశారు. అతి తక్కువ ఆదాయం వస్తుందనే నెపంతో హాల్ట్‌ను ఎత్తివేశారు. అప్పటి నుంచి గతంలో నరసరావుపేట ఎంపీలుగా ఎన్నికైన మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మోదుగుల వేణుగోపాలరెడ్డి, రాయపాటి సాంబశివరావులతో పాటు రైల్వేశాఖకు చెందిన జీఎంకు ఈ తొమ్మిది గ్రామాల సర్పంచులు, ప్రజల సంతకాలతో వినతిపత్రాలు అందించారు. అయినా ఈ సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉన్నట్లుగా ఉంది. ఇక్కడ హాల్ట్ ఏర్పాటు చేయడం వలన మండలంలోని పాలువాయిగేటుతో పాటు మంచికల్లు, పాలువాయి, తుమ్మకోట, పశర్లపాడు, జెట్టిపాలెం, మల్లవరం, మాచర్ల మండలంలోని గన్నవరం, కంభంపాడు గ్రామాలకు చెందిన ప్రజలకు కూడా ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది. బస్సు చార్జీలతో పోలిస్తే రైల్వేచార్జీలు మాత్రమే సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు అవకాశం కల్పించేందుకు ప్రస్తుతం ఎంపీ కృషి చేయాలని కోరుతున్నారు.

#### ఆదాయమే ముఖ్యమా...



తొమ్మిది గ్రామాలకు చెందిన సుమారు 35 వేల మంది ప్రజలకు మేలు. రైల్వేశాఖ అధికారులకు మాత్రం ఆదాయమే ముఖ్యంగా ఉంది. వేలామంది ప్రజలు రైల్వే సౌకర్యంలేక అనేక ఇబ్బందులకు గురౌతున్నా ఇప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

– గొలమారి నాగలక్ష్మీ శ్రీనివాసరెడ్డి, సర్పంచి పాలువాయి గేటు

#### చార్జీలు అందుబాటులో ఉంటాయి



పేద, మధ్య తరగతి ప్రజలకు బస్సు చార్జీలను భరించడం కష్టంగా ఉంది. ఇక్కడ రైల్వే హాల్ట్ లేకపోవడం వలన ఈ గ్రామాలకు చెందిన సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ రైలుకు హాల్ట్ ఏర్పాటుకు అధికారులు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ తదితర ప్రజా ప్రతినిధులు చొరవతీసుకోవాలి. తక్కువ ఖర్చుతో పలు ప్రాంతాలకు వెళ్లేందుకు రైలు సౌకర్యం కల్పించడానికి వెంటనే చర్యలు చేపట్టాలి.

– కేతావత్ రంగనాయకులు, సీపీఐ మండల కార్యదర్శి

# మరీ రోడ్డుపై వదిలేస్తారా...

పిడుగురాళ్ల: కూటమి పాలనలో అధికారుల ఇష్టారాజ్యం అయింది. అడిగే నాథుడే లేకుండా పోయారు. ప్రశ్నిస్తే కేసులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వివరాలు.. అధిక లోడుతో వెళ్తున్నాయని స్వాధీనం చేసుకున్నారు సరే.. మరి వాటిని రోడ్డుపైనే వదిలేస్తా ఎలా సారూ.. పిడుగురాళ్ల పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా ఎదురుగా గత నాలుగు, ఐదు రోజుల నుంచి టిప్పర్లు, లారీలు ఆగి ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం అధిక లోడుతో వెళ్తున్నాయని పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ లారీలను పోలీస్ స్టేషన్ వెనుక ఖాళీగా ఉన్న స్థలంలో పార్కింగ్ చేయిస్తారు. కానీ ఎందుకో విచిత్రంగా నడిరోడ్డుపై వదిలేశారు. అంతేకాకుండా లారీలు అడ్డంగా ఉండటంతో తెలుగు బాప్టిస్ట్ చర్చి ఉండడంతో ఆదివారం అటుగా వెళ్లే భక్తులకు కూడా ఇబ్బందిగా మారిపోయింది. అంతేకాకుండా ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్దకు ఎవరైనా అతిథులు వచ్చినా ఈ వాహనాలు అడ్డంగానే ఉంటున్నాయి. లారీ వెనుక వైపు చిరువ్యాపారులు చేసుకునే వారికి కూడా వ్యాపారాలు సక్రమంగా ఉండటం లేదని వాపోతున్నారు. నిత్యం అమరావతి, మాదినపాడు వంటి ప్రాంతాల నుంచి అధిక లోడుతో టిప్పర్లు పదుల సంఖ్యలో వస్తుంటాయి. కానీ కేవలం నాలుగైదు పట్టుకోవటం, మిగిలిన ఎందుకు పట్టుకోలేదో అనే ప్రశ్నలు పట్టణ ప్రజలు మెదులుతూనే ఉన్నాయి. అంతేకాకుండా జానపాడు రోడ్డులో నిత్యం ట్రాక్టర్లను ఏర్పాటు దళారులు అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్నారు. వారిపై కూడా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.




పట్టుబడిన ఇసుక లోడు లారీలు

# ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం

సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్




గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రొంపిచర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ ఉద్యమిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ అన్నారు. స్థానిక బీసీ కాలనీలో గల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పార్టీ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నిర్లక్ష్య వైఖరి కారణంగానే పాకిస్థాన్ ఉగ్రవాదులు దేశంలో చొరబడి 26 మందిని దారుణంగా హతమార్చారన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారని మోదీ యుద్ధాన్ని ఆపడం దారుణమన్నారు. అదేవిధంగా మావోయిస్టులను చర్చలకు పిలిచి వారిని చంపడం హేయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. అర్హులైన నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము మాట్లాడారు. తొలుత స్థానిక చెరువుకట్ట సెంటర్లో సీపీఐ జెండాను సీపీఐ, రైతు సంఘం సీనియర్ నాయకులు మాలెంపాటి నరసింహారావు ఆవిష్కరించారు. అక్కడ నుంచి మహాసభ జరిగే ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, ఏరియా నాయకులు ఉప్పలపాటి రంగయ్య, ప్రజానాట్యమండలి కళాకారులు షేక్ చిన్న జాన్ సైదా, సీపీఐ మండల నాయకులు రొడ్డా అంజిరెడ్డి, పిడెం హుస్సేన్, జమ్ములమూడి వెంకటేశ్వర్లు, చిట్యాల శ్రీనివాసరెడ్డి, సరికొండ తిమ్మరాజు, గాలి వెంకటశివ, ముప్పూరి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్టీ కాలనీలో న్యాయవిజ్ఞాన సదస్సు



నరసరావుపేటటౌన్: తల్లిదండ్రులు ప్రతిరోజు పిల్లలపై శ్రద్ధ చూపటానికి కొంత సమయం కేటాయించాలని రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.గాయత్రి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లింగంగుంట్ల ఎస్టీ కాలనీలో ఆదివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యా హక్కు చట్టం, బాలల హక్కులు, బాల కార్మిక నిషేధ చట్టం గురించి వివరించారు. తప్పిపోయిన బాలలు, వారి తల్లిదండ్రులకు అవసరమైన న్యాయ సహాయం కోసం మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలన్నారు. పాఠశాలల్లో బాలికలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### బియ్యం, దుస్తులు వితరణ



వినుకొండ: బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీ మాధవరావు ఆధ్వర్యంలో పట్టణంలోని లాయర్స్‌స్ట్రీట్‌లో 35 మంది నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు వితరణ చేశారు. అనంతరం జీవీ మాధవరావు దంపతులను ఘనంగా సన్మానించారు. 100 నెలలుగా నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు సంఘం తరపున బియ్యం, నూతన వస్త్రాలను అందించడం అభినందనీయమని అన్నారు. బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

### పోలీసు బందోబస్తు మధ్య అంత్యక్రియలు

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామానికి చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావు మృతదేహాలకు పటిష్టమైన బందోబస్తు మధ్య ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనటంతో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గ్రామంలో పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరి అంత్యక్రియలలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా మాసశివరాత్రి పూజలు



నర్శింగపాడు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి లక్ష మల్లెలతో అర్చన



విశేష అలంకరణలో నర్శింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి

నకరికల్లు: మండలంలోని నర్శింగపాడు గ్రామంలో అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి వేడుకలు ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. స్వామి వార్లకు విశేష పూజలు చేశారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. గురుప్రార్థనతో ప్రారంభమైన పూజలు ఆలయ ప్రదక్షిణలు, గోత్రనామపఠనం, రుద్రహోమం, చండీహోమం తదితర పూజలు చేశారు. మహిళా భక్తులు లక్ష మల్లెలతో అర్చనలు చేశారు. అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించారు. మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అమ్మవారిని, స్వామి వారిని విశేషంగా అలంకరించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆయా ఆలయాల్లోని స్వామి వార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

# ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం



నాదెండ్ల: మండలంలోని చందవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ ఆంజనేయస్వామి, బొడ్రాయి మూడో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిని, స్వామివారిని అలంకరించారు. ఆంజనేయస్వామికి ఆకుపూజ, పంచామృతాభిషేకం, సింధూర పూజ నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజ, గోత్రనామ పూజలు చేశారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. ఆలయాలను సుందరంగా అలంకరించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

### గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

బెల్లంకొండ: త్రైత సిద్ధాంత భగవద్గీతే శ్రీకృష్ణుని నిజ బోధ అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల చిలకలూరిపేట కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పాపాయపాలెం, నందిరాజుపాలెం, నాగిరెడ్డి పాలెం గ్రామాలలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మూడు గ్రామాలలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించి, జీవితంలో జ్ఞానమార్గం అనుసరించవలసిందిగా కోరారు. ప్రతి ఒక్కరూ కర్మయోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలని ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి భగవద్గీతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యద్దనపూడి వీరాంజనేయులు, అరుణ, కార్తీక్, నారాయణమ్మ, అనురాధ, వెంకటలక్ష్మీ, శ్రీను, వీరయ్య, రాఘవ, సుందరం, రామాంజనేయులు, గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర నాయక్‌లు పాల్గొన్నారు.

### సత్తెనపల్లి నుంచి తిరుపతికి బస్సు సర్వీసు

సత్తెనపల్లి: సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్ నుంచి తిరుపతికి నూతనంగా హయర్ బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ సీఐ ఫాతిమా తెలిపారు. పట్టణంలోని బస్టాండ్‌లో గుదే శివప్రసాద్ తిరుపతికి ఏర్పాటు చేసిన నూతన హయర్ బస్సును ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్ నుంచి తిరుపతికి హయర్ బస్సు వెళ్లేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు, తిరుపతి వెళ్లే ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ శ్రీనివాస్, ఆర్టీసీ ఏడీసీ శ్రీరాములు, ఆర్టీసీ ఉద్యోగులు, పుర ప్రముఖులు తదితరులు ఉన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముప్పాళ్ల: ముప్పాళ్ల విద్యుత్ ఉప కేంద్రంలో నూతన 11 కేవీ బ్రేకర్, లైన్స్ మరమ్మతులలో భాగంగా ఈ నెల 26వ తేదీ సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ జి.సుచరిత ఆదివారం తెలిపారు. మండలంలోని గోళ్ళపాడు, కుందురువారిపాలెం, తురకపాలెం, కొంకావారిపాలెం, లంకెలకూరపాడు, పలుదేవర్లపాడు, నార్నెపాడు, బొల్లవరం, దమ్మాలపాడు, రుద్రవరం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# చదువులమ్మ నీడలో.. జ్ఞాపకాల ఒడిలో..



పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు, టీచర్లు

- లూథరన్ పాఠశాలలో అపూర్వ సమ్మేళనం
- 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న 2000-21 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

యడ్లపాడు: కాలచక్రం ఎంత వేగంగా తిరిగినా, విద్యార్థి దశలోని స్నేహాలు, గురువుల బోధనలు మనసు మరచిపోదు. స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాల ఆవరణలో 2000–2001 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా ఏర్పాటు చేశారు. 25 సంవత్సరాల విరామం తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకున్న అక్కడి వారి కళ్లు ఆనందభాష్పాలతో, హృదయాలు సంతోషాలతో విరబూసి, అనురాగ జల్లుల్లో తడిచి ముద్దయ్యాయి. 85 మంది పూర్వ విద్యార్థుల్లో 57 మంది ఈ వేడుకకు హాజరయ్యారు. నాటి గురువులు కనకవల్లి, వినతి, బాలసరస్వతి, మహితకుమారి, నిర్మల కుమారి, సునీత, శ్రీ షేక్ షావలి, రామిరెడ్డి, బ్రహ్మం, వాసు, పీటర్‌లను పూలదండలు, శాలువాలు, నూతన వస్త్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని బి.రాజేష్, అబ్బూరి శ్రీనివాసరావు, తులం అనిల్, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, పోపూరి శ్రీనివాసరావు, కేపీ చారి, చాగంటి మైథిలీ, వంగిపురపు పద్మావతి, ఆర్టీసీ డిపో మేనేజర్ అజిత, పూర్వ విద్యార్థులు ముందుండి, మిగిలిన బ్యాచ్ వారిని సమన్వయం చేసేందుకు కృషి చేసినట్లు తెలిపారు.

# జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ కార్యక్రమంలో బ్రహ్మయ్య, నాగేశ్వరరావు

ముప్పాళ్ళ: దేశ సమైక్యత, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన దార్శనికులు బాబు జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్‌లు అని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ అన్నారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మయ్యమాదిగ మాట్లాడుతూ జాతి దార్శనికుల విగ్రహాలు మండల కేంద్రంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

మాజీ ఎంపీపీ పచ్చల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి విగ్రహాల ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నం నేటికి ఫలించిందన్నారు. సాధ్యమైనంత వేగంగా నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించుకునేలా కమిటీ చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ గుండాల నగేష్, అధికార ప్రతినిధి కోట సుబ్బు, కందుల జార్జి, సీపీఎం నాయకులు సుందరయ్య, గద్దల కృపారావు, రుద్రబాటి చంద్రశేఖర్, పలుకూరి రామారావు, గుజ్జర్లపూడి అశోక్, రుద్రపాటి చంద్ర, రామకృష్ణ, అంకాల కోటిలింగం, గన్నెపూడి బోసు, చింతపల్లి లక్ష్మయ్య, జిల్లా నాయకులు పర్ల రామయ్య, కొడవటిగంటి సత్యానందం, సామేలు, జనసేన, టీడీపీ నాయకులు శ్రీనివాసరావు, పరమేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



మాచర్ల: కృష్ణవేణి జూనియర్ కళాశాల, ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ నుంచి డాక్టర్ రామకోటయ్య, క్లబ్ ముఖ్య సభ్యులు, లయన్స్ క్లబ్ నుంచి సాయి మార్కొండా రెడ్డి, వాసవి క్లబ్ నుంచి ఓ చెన్నకేశవ, మేడం నాగేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయుర్వేద వైద్య శిబిరాన్ని కేరళ రాష్ట్రానికి చెందిన ప్రముఖ వైద్య కేంద్రమైన శ్రీధరీయం ఆయుర్వేదిక్ పంచకర్మ వైద్యులు డాక్టర్ కృష్ణదాస్ పాల్గొని ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారికి విలువైన సూచనలు, సలహాలను అందించారు. ఉచిత వైద్య శిబిరం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం ప్రతినెల నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరాన్ని మాచర్ల, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.